కాలప్రవాహపు పాయలు

"వెధవ ఉక్క! వెధవ పక్క" అని తిట్టుకున్నాడు పురుషోత్తం. అతనికి అనిద్ర పట్టుకుంది. రోజూ ఇదే వరస. కొంతకాలంగా అతని శరీరానికి ఎంత చల్లదనమూ చాలటం లేదు. మంచుమీద పడి దొర్లితేనేగాని తపన చల్లారదనిపిస్తుంది. పక్క వేడి భరింప శక్యం కాకుండా వుంటుంది. డాక్టరు నడిగితే "నువు నిద్రలేమితో బాధపడుతున్నావు. మందు రాసిస్తాను. రోజూ పడుకోబోయే ముందు సేవించు" అని సలహా ఇచ్చాడు. పురుషోత్తం మందు కొన్నాడు కూడానూ, అయితే దాన్ని వేసుకోబుద్ధి పుట్టలేదు. ఈ మందులన్నీ కాలక్రమాన శరీరాన్ని చెడగొట్టేవే.

అసలే శరీరం చెడివుంది. ఒకప్పుడు కసరత్ చేసిన శరీరం పొట్టి ఊబవొళ్ళయి ఊరుకుంది. ఏమవుతుంది? తిండి జాస్తి అయింది. కారులో తిరగటం మూలంగా రోజుకు ఫర్లాంగు నడకకూడా ఉండటం లేదు. ఆ రోజుల్లో శరీరం సర్కస్ వాడి శరీరంలాగా ఉంచుకోవటం అదొక సరదాగా వుండేది. వారానికొకసారి ఛాతీ నడుమూ కొలుచుకోవటం, రెంటికీ తేడా హెచ్చుతుంటే సంతోషించటం, తగ్గుతూంటే కంగారు పడి మరింత కసరత్తు చెయ్యటం. ఏమిటో చాదస్తం. తనేం మూటలు మొయ్యాలా, పలుగు తీసుకు తవ్వాలా? తనకెందుకు సర్కసువాడి శరీరం? వ్యాపారంలో పుష్కలంగా డబ్బొస్తోంది. ఇంకా వస్తుంది కూడానూ. ఇంక మూడు తరాలవరకూ తన కుటుంబానికి ఢోకా లేదు. రాష్ట్ర మంత్రుల్లో తనతో భాయి భాయీగా ఉండేవాళ్ళు ముగ్గురున్నారు. తన పలుకుబడికేం లోపంలేదు. మనిషి కోరదగినవన్నీ తనకున్నాయి. పౌరోహిత్యాలు చేసుక్ను తన తాతా, హైయ్యర్ ట్రెయినింగు అయి స్కూలు మేష్టరు పనిలో జీవితమంతా గడిపిన తన తండ్రీ ఈ క్షణాన తనను చూస్తే యెంతో గర్విస్తారు. సందేహం లేదు. తన బావమరిది ప్రభుత్వ యింజనీరు, తన మామగారు పోలీసు సూపర్నెంటు చేసి రిటైరైనవాడు. తన అల్లుడు అమెరికాలో ప్రత్యేక వ్యవసాయ శిక్షణ పొందుతున్నాడు. తన కొడుకు నేత్ర వైద్యంలో ప్రత్యేకత సంపాదించటానికి ఇంగ్లండు వెళ్ళాడు. ఇంగ్లండులో చక్కగా మంచు పడుతుంది. ఆ మంచు మీదినుంచి వచ్చే గాలికి శరీరం ఎట్లా అవుతుందో పురుషోత్తం

ఊహించుకోగలిగాడు.... తాను ఏ దొరో అయి పుట్టవలసింది – ఈ దిక్కుమాలిన ఉక్కతో బాధపడకుండా!

ఎట్లాగూ నిద్ర రానేరాదు. పురుషోత్తం తన విజయ పరంపరను సింహావలోకనం చేసుకోసాగాడు. తనకు ఇరవై నాలుగు వెళ్ళేదాకా జీవితం తడువుకోవటమే అయింది. ఆ తరవాత అది హైరోడ్డు పట్టింది. ఈ పాతికేళ్ళనుంచీ ఆ జీవితంలో చెప్పుకోదగిన పొల్లు రాలేదు. ఇరవై అయిదో యేడు ప్రవేశించింది లగాయతు తాను తన గమ్యస్థానాన్ని స్పష్టంగా, నిశ్చలంగా చూడగలిగాడు. తప్పుడు ఆశయాలనూ, తనకు పనికిరాని భావాలనూ వ్యక్తులనూ అలవాట్లనూ విశ్వాసాలనూ దూరంగా ఉంచగలిగాడు. ఈ పాతికేళ్ళ తపస్సుకూ ఒక్క విఘ్నమైనా కలగలేదు. ఈ తపస్సు నిర్విఘ్నంగా సాగటానికి తాను చాలామంది స్నేహితులను పోగొట్టుకోవలసి వచ్చింది. చాలామంది మిత్రుల సలహాలను తృణీకరించవలసి వచ్చింది. ఒక్కొక్కసారి తన అంతరాత్మనే కఠినంగా శాసించవలసి వచ్చింది. ఏమయితేనేం? తాను మాత్రం గీసుకున్న గీత మీద సూటిగా నడిచాడు. అసిధారావ్రతం ఫలించింది.

పురుషోత్తం తన మొదటి అయోమయ జీవితం తలచుకుని నవ్వుకున్నాడు. ఆ రోజుల్లో తన మనస్తత్వాన్ని తలుచుకుంటే తనకే ఆశ్చర్యం వేస్తుంది. ఆ రోజుల్లో కొంత కాలం తాను సంఘాన్ని మరమ్మత్తు చెయ్యటం గురించి ఆలోచించాడు. తానొక గొప్ప రాతగాడు కావాలని కూడా ఆశించాడు. రాతగాళ్ళు సంఘానికేదో చేశారన్న భ్రమ తన కప్పట్లో ఉండేది. వీరేశలింగం, గురజాడ అప్పారావు మొదలైనవాళ్ళ రచనలలో గల గొప్పతనం గురించి తాను కూడా ఆ రోజుల్లో చర్చించాడు. ఏవేవో ఆదర్శాలు పెట్టుకుని తాను కొన్ని రచనలు చేశాడు కూడానూ. చిత్రమేమిటంటే వాటిని మెచ్చుకున్న వాళ్ళున్నారు – తనకన్న మూఢులు!.... ఆ రోజుల్లో తనకు "ప్రేమ" ఒక పెద్ద జీవిత సమస్యగా ఉండేది. అందాకా యెందుకూ? తానప్పట్లో ఒకతెను ప్రేమించి ఆమెకోసం తపించాడు కూడానూ. ఆమెను పెళ్ళి చేసుకోకపోతే తన జీవితమంతా వ్యర్థమవుతుందని కూడా అనిపించింది! ఎంత దుర్భ్రమ! ఏదీ? తానామెను పెళ్ళాడలేదు. అయినా తన జీవితం మూడూ పూలూ, ఆరు కాయలుగా వుందే..... అప్పట్లో తన కింకొక జాడ్యం కూడా దాదాపు అంటుకుంది – సోషలిజం. కొంత మార్క్సు సాహిత్యం, లెనిన్ పుస్తకాలూ సంపాదించాడు కూడానూ. కాని వాటి మాయలో పడకముందే తన జీవితంలో పరివర్తన కలిగింది. యింకా నయం.

పురుషోత్తం ఆలోచన మానేసి ఆలకించాడు. తలవాకిలి తలుపెవరో తట్టినట్టయింది. భ్రమపడ్డాననుకున్నాడు. కాని తలుపు తెరిచిన చప్పుడు కూడా అయింది. తన యింటి కీరాత్రివేళ ఎవరొస్తారు?

హాలులో శ్రీరాములు గొంతు వినిపించింది.

"అయ్యగారు నిద్రపోతున్నారు... ఊఁ హుఁ లేపటానికి వీల్లేదు. భోజనాలయ్యాయా? అయితే ఈ హాలులో మంచాలు వేయిస్తాను పడుకోండి."

ఎవరో మెయిలులో దిగి ఉంటారు. ఎవరి బాపతు చుట్టాలో. పోనీ, తన కెందుకు పీడ? రేపు తెల్లారినాకే కనపడి కుశలప్రశ్న చెయ్యవచ్చు.

2

ఒక అరగంట గడిచింది. అతిథుల సంభాషణా, నవ్వులూ హాలులో నుంచి వినిపిస్తున్నాయి. వచ్చిన వారి సంఖ్య మొదట సరిగా తెలియలేదు. తరవాత యిద్దరున్నట్లు తెలిసింది. అందులో వొకడు పురుషుడు, రెండోది స్త్రీ. యెవరో స్త్రీ పురుషులు? భార్యా భర్తలా? వాళ్ళు అతిథులల్లే ప్రవర్తించటం లేదు. స్వేచ్ఛగా, స్వగృహంలో వున్నట్టే మాట్లాడుతున్నారు. మగగొంతు తానెన్నడూ విన్నది కాదు; ఆడ గొంతు విన్నట్టుంటమే గాక, అది చెవిని పడితే వొళ్ళు గగుర్పొడుస్తున్నది. తనకు జ్ఞాపకం వున్నంతలో ఏ ఆడదాని గొంతూ తనలో యిటువంటి వికారం కలిగించలేదు. ఈ యాభయ్యో ఏట ఆడదాని గొంతు వింటేనే వళ్లు జలదరించటమేమిటి?

వాళ్ళు భార్యా భర్తలే అయి ఉండాలి. ఎందుకంటే వాళ్ళు వొకరితో వొకరు యెంతో చనువుగా వుండి కూడా వుద్రేకం లేకుండా మాట్లాడుకుంటున్నారు. భార్యా భర్తలు కాకపోతే యింత చనువు వెంట యింకెంతో వుద్రేకం వుండి తీరుతుంది.

"ఇక్కడ మంచినీళ్ళున్నాయేమో?" అన్నది స్త్రీ.

"ఆ బీరువా పక్కన కూజా వుంటుంది తాగు" అన్నాడు పురుషుడు. అతనికి ఇల్లంతా తెలిసినట్టే కనబడింది. ఇంట్లో నౌకర్ల పేర్లన్నీ తెలిసినట్టుగా మాట్లాడాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆమె అతిథిలాగే ప్రవర్తించింది గాని, అతను ఆతిథ్యం యిచ్చేవాడిలాగా ప్రవర్తించాడు. ఇంట్లో యెంతమంది పేర్లు వుచ్చరించినా తన పేరు మాత్రం యిద్దరిలో వొకరూ ఉచ్చరించలేదు.

తన ఇల్లు మాదిరిగానే వ్యవహరిస్తున్న ఈ జోడు ఎవరయిందీ కూడా ఊహించలేక పోయినందుకు పురుషోత్తానికి మండిపోయింది. లేచి హాలులోకి వెళ్ళి వాళ్ళ ఎదట పడదామనుకున్నాడు. కాని భయం వేసింది. వాళ్ళను తాను పోల్చుకోలేకపోతే? కిందటేడు యిట్లాగే తన చెల్లెలి మొగుణ్ణి గుర్తించలేక పెద్ద "గ్రేడ్" తిన్నాడు. వద్దు, వద్దు. వాళ్ళు పడుకున్నాక వెళ్ళి చూస్తే సరీ.

వాళ్లు పడుకునే యత్నంలో ఉన్నారు కూడానూ.

"రెండు గంటలు కావస్తోంది. ఇంక పడుకుందామా? అసలే బడలి వున్నావు" అన్నాడు పురుషుడు.

"మళ్ళీ పెందలాడే లేవాలి. చాలా పని ఉంది. ఇంకో రెండు గంటలు మేలుకుంటే అదే తెల్లవారిపోతుందని చూస్తున్నా" అంది స్త్రీ.

"బెజవాడలో మీటింగులు చాలా చక్కగా జరిగాయి కదూ? ఆ రోజు కారోజు ప్రజలలో ఎంత చైతన్యం వస్తున్నదీ చూస్తున్నావా?"

"ఎందుకు రాదూ? ఎవరి జీవితాలు వాళ్లు అర్థం చేసుకుంటున్న కొద్దీ ఆ జీవితాలను మార్చుకునే చైతన్యం దానంతట అదే వస్తుంది. వాళ్ళు జీవితాన్ని అర్థం చేసుకునేటట్టు చెయ్యటమే మన ధర్మం."

"రేపు మైదానంలో జరిగే మీటింగు చూడు ఎట్లా వుంటుందో. పదిహేను వేలకు తక్కువ రారు."

"ఎందుకు రారూ? మీ స్వక్షేత్రమైనప్పుడూ? కిందటేడు క్లబ్బులో మీటింగు పెడితే రోడ్లనిండా జనం మూగలా?"

కాస్సేపు ఇద్దరూ మౌనంగా వున్నారు.

పురుషోత్తం ఆశ్చర్యపడ్డాడు. ఎవరీ "లెక్చర్లిచ్చే పండితుడు?" కిందటేడు క్లబ్బులో మీటింగేమిటి? తనకు మీటింగూ జ్ఞాపకం లేదు. అందులో మాట్లాడిన వాడూ జ్ఞాపకంలేదు. వీళ్ళెవరో లోకోద్ధారకుల్లాగా మాట్లాడుతున్నారు. అటువంటివాళ్ళెవరూ తన బంధుమిత్రుల్లో – కనీసం తన ఇంటికి చొరవగా వచ్చే వారిలో లేరే!

"మన బెజవాడ మీటింగు గురించి ఈ పూట మెయిల్లో బాగా రాశారు చూశావా?"

"ఒక్కోసారి మెయిల్లో కాంగ్రెసు వ్యతిరేక వార్తలు బాగానే యిస్తారు. మీరు పార్లమెంటు ఎన్నికల్లో గెలిచినప్పుడు మిమ్మల్ని గురించి పదిలైన్లు రాశారు."

"దానికేమిట్లే?"

వీడెవడో పార్లమెంటు మెంబరుకూడానా? ఆలోచిస్తున్న కొద్దీ పురుషోత్తానికి మతి పోతోంది. వీళ్ళిద్దరూ తనను వంచించటానికి కోతలు కోస్తున్నారేమోనని సందేహించాడు. కాని తాను వింటున్నట్టు వాళ్ళకేం తెలుసూ?

అకస్మాత్తుగా పురుషోత్తానికి జ్ఞాపకం వచ్చింది. ఇవాల్టి 'మెయిల్' తన తలగడా కిందే వుంది. పురుషోత్తం చప్పుడు చెయ్యకుండా దాన్ని తీసి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి లైటు వేసి గబగబా బెజవాడ మీటింగు వార్త కోసం చూశాడు. ఎక్కడా అటువంటి మీటింగే లేదు. పేపరు మీది తేదీ చూశాడు. ఇవాల్టిదే.

యింక సందేహమెందుకూ? వీళ్ళిద్దరూ ఏ వెర్రాసుపత్రినుంచో పారిపోయి వచ్చిన

బాపతై వుంటారు. ఒక్కొక్క రకం వెర్రిని పట్టుకోవటం కష్టం. వీళ్లు అటువంటి బాపతే అయివుంటారు, అందుకే ఎంత ఆలోచించినా వీళ్లెవరయిందీ తనకు తెలియటం లేదు. వీళ్ళను యిప్పుడే శ్రీరాములు చేత బయటికి గెంటించటం మంచిది.

బాత్‌రూమ్‌లైటు ఆర్పేసి పురుషోత్తం బెడ్‌రూమ్‌లోకి వచ్చాడు.

అవతల హాలులో నిశ్శబ్దంగా వుంది. "అతిథులు" నిద్రపోతున్నారేమో.

చప్పుడు చెయ్యకుండా బెడ్‌రూమ్ తలుపు తెరిచి పురుషోత్తం హాలులోకి అడుగుపెట్టాడు.

3

హాలులో లైటు వేసిన మరుక్షణం పురుషోత్తం కొయ్యబారిపోయినాడు. వాకిలి కెదురుగా మంచం మీద పడుకున్న స్త్రీ తను వూహించినట్టు యేపాతిక, ముప్ఫైయేళ్ళదీ కాదు. దాదాపు నలభై అయిదేళ్ళది. ఆమెను తానుచూసి రెండు పుష్కరాలు దాటినా యింకా ఆ మొహం నిన్న చూసినట్టే వుంది. యెందుకుండకూడదూ? ఒకప్పు డామెకోసం తాను తపించలేదా? ఆ తపన ముందు యే వుక్క ఆగుతుంది? యే పక్కవేడి ఆగుతుంది?

మనిషి యిప్పటికీ యెంత అందంగా వుందో! ఆమెకేసి చూస్తున్న కొద్దీ కాలచక్రం వెనక్కు తిరిగి తాను మళ్ళీ ఇరవై మూడేళ్ళ యువకుడైనట్టనిపించింది. తాను మొట్టమొదటిసారి ఆమె చెయ్యిపట్టుకోవటం జ్ఞాపకం వచ్చి శరీరం వేడెక్కినట్టయింది – నీళ్ళకుండలాగా వుండే తన శరీరం! తన తండ్రిని ధిక్కరించి ఈమెను పెళ్ళి చేసుకోవటానికి కూడా నిర్ణయించాడు. ఆ విధంగా ఈమెకు తాను ఉత్తరం రాశాడు కూడానూ. అదే తన జన్మలో రాసిన నిజమైన ప్రణయలేఖ. కాని ఆ లేఖ పోస్టు డబ్బాలో పడలేదు. చినిగి ముక్కలై పాకీ డబ్బాలో పడిపోయింది. భూమిలోనూ వాయువులోనూ నీటిలోనూ వుండే రసాయనికాలు తన ప్రణయ సందేశాన్ని అర్థం చేసుకోకుండానే జీర్ణించుకున్నాయి. ఆ లేఖను చించెయ్యటమే తన జీవితంలో ప్రధానమైన పరివర్తన. అంతవరకూ కాలిబాటల వంపులలో పడి తిరుగుతున్న తన జీవితం ఆ క్షణం నుంచీ హైరోడ్డు పట్టింది.

చిత్రం. ఆమెకేసి చూస్తుంటే ఆమే తన నిజమైన భార్య అయినట్టూ, అవతల బెడ్‌రూమ్‌లో పడుకునిఉన్న గుర్రం మొహం మనిషి ఎవరో పరాయిదయినట్టూ అనిపిస్తోంది.

ఇంతకీ ఈమె ఇక్కడికెందుకు వచ్చినట్టు? ఆ మగవాడు – తాను నిలబడిన చోటికి అతని తలమాత్రమే కనిపిస్తోంది – ఆమె భర్త అయి ఉంటాడు. వీళ్ళిద్దరూ ఈ రాత్రివేళ తన ఇంటికెందుకు వచ్చారు? ఈ పాతికేళ్ళనుంచీ ఈమె జాడే తెలీదు తనకు.

అటువంటిది తనజాడ ఎట్లా కనిపెట్టింది. తెల్లవారగానే ఈమెను చూసి తన భార్య అల్లరిపెడుతుందేమో, ఆమెను పెళ్ళాడకమునుపు మరొక స్త్రీని పెళ్లాడినంతపనీ చేశాననీ తాను భార్యతో ఎన్నడూ చెప్పలేదు కూడానూ. తాను భార్యకు తెలియకుండా దాచిన జీవిత రహస్యం ఇదొక్కటే.

నిద్రపోతున్న ఆ పాత ప్రియురాలిని చూస్తుంటే అనేకమైన భావాలు ఒకేసారి పురుషోత్తంలో కలిగాయి. దగ్గిరికిపోయి ఆమెను ముట్టుకుందామనిపించింది. శ్రీరాముల్ని పిలిచి యిప్పుడే వీళ్ళను వెళ్ళగొట్టింతామనిపించింది. ఆమెను లేపి మాట్లాడాలనిపించింది. ఆమె లేవకమునుపే కారులో ఎక్కి దూరంగా ఏ వూరైనా పోదామనిపించింది.

ఈ భావ సంఘర్షణలోనే అతను రెండడుగులు ముందుకు వేసి ఆమెను సమీపించాడు. అతని గుండెనెవరో పట్కార్లుపెట్టి లాగుతున్నట్టుంది. ఈమెను తానెందుకు పెళ్ళాడలేదు? దేనికోసమై తానీమెను త్యాగం చేశాడు? ఈమెకన్న విలువైనది తాను జీవితంలో ఏం సాధించాడు? ప్రేమ అనేది వట్టి శుష్కపదమని తాను నమ్మినమాట నిజమే కాని, ఈ నమ్మకం ఈమె దూరంగా వుండగా కుదిరినంతగా ఈమె కనిపిస్తుంటే కుదరటం లేదేం? "ఈమెను పెళ్ళాడకపోతే అన్యాయం చేసినవాణ్నవుతానేమో!" అన్న సందేహం ఆనాడు తనకు కలిగినప్పుడు, "ఆఁ సింగినాదంకాదూ! నాకన్న మంచి మొగుణ్ణే సంపాదించుకుంటుందిలే! ఏమిటి నా ఆధిక్యత?" అని తన మనస్సును సమాధాన పరుచుకున్నాడు. ఆమె పెళ్లాడినవాడు తనకంటె అధికుడో కాడో తెలుసుకునే అవకాశం తనకిప్పుడు లభించింది.

పురుషోత్తం రెండో పక్కకేసి తిరిగి నివ్వెరపోయినాడు. ఆ పురుషుడు ఎప్పుడు మేలుకున్నాడో గాని పక్కమీద లేచి కూచుని తనకేసి చిరునవ్వు నవ్వుతున్నాడు.

అతనికీ తనలాగే ఏ యాభయ్యో వుంటాయి. అయినా శరీరం దృఢంగా వుంది. యౌవనపు లక్షణాలింకా చాలా మిగిలివున్నాయి. జుట్టు తనకు నెరసినంతగా నెరవలేదు. తన జుట్టుకన్న వొత్తుగా కూడా వుంది. చిత్రమేమిటంటే బాగా చూచిన మొహం లాగా కూడా ఉంది. అయినా జ్ఞాపకం రావటం లేదు.

అతనికీ తనకూ మధ్య మౌనంకన్న కూడా అతని వెటకారపు చిరునవ్వు భరించటం తనకు కష్టమనిపించింది.

"ఎక్కడ చూశానో జ్ఞాపకం రావటంలేదు" అన్నాడు పురుషోత్తం.

"నన్ను నువు ఎక్కడా చూడలేదు – అద్దంలో తప్ప. నా పేరు పురుషోత్తం. పేరడుగుల పురుషోత్తం" అన్నాడా మనిషి.

4

తనతో మాట్లాడుతున్నదీ, తనను చూసి వెటకారంగా నవ్వుతున్నదీ తన భూతమేనని అర్థం చేసుకోవటానికి పురుషోత్తం బుర్రకు చాలా శ్రమ అయింది. ఇది అచ్చగా భూతం కూడా కాదు. ఈ భూతం వర్తమానానికి చేరుకుంది. సామాన్యంగా భూతాలు ఈపని చెయ్యలేవు. వెనక తన తల్లి సోదిలోకి వచ్చి అంతకు పూర్వం పదిహేనేళ్ళ క్రితం తనకుండిన కోరికలన్నీ ఏకరువు పెట్టింది. సోదిలోకి వచ్చింది తన తల్లే అని అనుకోవటానికి ఎన్నో బలమైన దాఖలాలు దొరికాయి గాని, ఆ చనిపోయిన ఆవిడ పదిహేనేళ్ళ కాలంలో కొంచెమైనా మారకపోవటం అతనికి చాలా వింతగా తోచింది.

ఈ భూతం అట్లాకాదు. దీనికి తనకున్నంత వయసూ వుంది. ఇది కాల ప్రవాహపు మరొక పాయలో కొట్టుకుపోయి మరొక పరిణామానికి గురి అయింది. మిగిలిన విషయాలెట్లా వున్నా పై చూపులకు తనకన్న ఇతనే బాగున్నాడు. నడుము సన్నగా ఉంది. మనిషి ఇంకా వ్యాయామం చేస్తున్న వాడల్లేనే ఉన్నాడు. మొహం కళగా వుంది. మూతి బిగువుగా వుంది. వయస్సు తనలో తెలిసినంతగా తెలియటం లేదు.

తన ఈ ప్రతిబింబాన్ని చూసి ఏమనుకోవాలో కూడా పురుషోత్తానికి తెలియటంలేదు. కాకపోయినా బతికున్న వాళ్ళకి భూతాలుండటమేమిటి? ఈ భూతం తన జీవితాన్ని అవమానిస్తోంది. ఇటువంటి అవమానాన్ని సహించటం పురుషోత్తానికి దుర్భరమనిపించింది. ఒక్కొక్క అద్దంలో చూసుకుంటే వున్న శరీరచ్ఛాయకంటె యెక్కువ కనిపించినట్టు ఈ భూతం తనకన్న ఒక్క పిసరు యెక్కువే సజీవంగా ఉంది.

ఇంతలోనే పురుషోత్తానికింకొక ఆలోచన వచ్చింది. ఆ మనిషి తనకు భూతమైతే, అతనికి తనూ భూతమేగా? తనను చూసి అతను ఏమనుకోవాలి? అయినా మరుక్షణమే పురుషోత్తానికి అతన్ని గురించి విచారం పోయింది. అతను దయ్యమై తనవెంట పడ్డాడుగాని, తాను అతనివెంట పడలేదే! అతన్ని గురించి తను యెందుకాలోచించాలి?

మొట్టమొదటగా అతనే మాట్లాడాడు;

"ఆనాడు మనం ఈవిడకు ఉత్తరం రాశాం చూశావా? ఆ మరుక్షణం నుంచి నీ దారీ నా దారీ వేరయింది. ఆ ఉత్తరం నువ్వు చించేశాననుకున్నావు. నేను దాన్ని పోస్టు చేశాను. తరవాత ఒక వారానికి మేమిద్దరం పెళ్ళాడాం. ప్రపంచంలో ఆదర్శప్రాయమైన పెళ్ళి కోటికి వొకటి జరుగుతుంది. మాది అటువంటి పెళ్ళి. జీవితంలో యింకేది లేకపోయినా ఒక్క మనిషి నీ పక్కవున్నదన్న తృప్తి నీకు కలిగిన తరవాత ఆ మనిషి కోసం యేది త్యాగం చెయ్యకూడదు, చెప్పు!"

అతను ఆగాడు. పురుషోత్తానికి ఏదో అర్థమవుతున్నట్లుగా ఉంది. అవును, ఈ రెండో పురుషోత్తమే తన అయోమయత్వం. ఆ రాత్రి వీడు తనను వదిలి ఎడంగా పోయినాడేమో తన మనస్సు తేరుకుని నిర్మలమైనట్టుగా అయింది. అందుకే ఆ క్షణం నుంచీ తన కర్తవ్యాన్ని కళ్ళ యెదుట చూసినట్టు తెలుసుకుని దాన్ని ఆచరించగలిగాడు.

"నేనీ పని చేయటం ధర్మం కూడా అయింది. ఎందుచేతనంటే మా పెళ్ళినాటికే ఈవిడకు నెల తప్పింది."

పురుషోత్తం ఉలిక్కిపడి, "నిజమా?" అన్నాడు. ఆయన ఆ పక్క మంచం మీద నిద్రపోతున్న స్త్రీ కేసి చూసి ఏదో జ్ఞాపకం వచ్చినవాడల్లే నిట్టూర్చాడు. నిప్పుసెగకు వెన్న కరిగినట్టు అతని మనస్సులో యే మూలో కొంచెం కరిగి కెలకబారింది.

"మా పెళ్ళి అయిన యెనిమిది నెలలకు మగపిల్లవాడు కలిగాడు."

"వాడి పేరేమిటి? ఎక్కడున్నాడు? ఎట్లా వుంటాడూ?" అన్నాడు పురుషోత్తం ఆదుర్దాగా.

"వాడు మహావీరులు జీవించేటట్టు జీవించి వీరుడల్లేనే మరణించాడు – తెలంగాణాలో!"

పురుషోత్తానికి వికారం కలిగినట్టయింది. తన కొడుకు కమ్యూనిస్టులతో చేరి తుపాకీతో చావటమా? ఈ సంగతి పొక్కితే తనను గురించి తన మిత్రులంతా ఏమనుకుంటారు? తన యెదురుగా వున్న ప్రతిబింబానికి ఈ కొడుకుతో ఎక్కువ సంబంధం ఉండి వుంటుందనీ, వాణ్ణి అటువంటి మార్గాన పెట్టినవాడు ఇతనే అయివుంటాడనీ పురుషోత్తానికి ఆ క్షణంలో తట్టలేదు.

"నా ఇన్నాళ్ళ జీవితం టూకీగా చెప్పేస్తాను. నేనూ నా భార్యా గొప్ప దారిద్ర్యం అనుభవించాం. ఆ రోజుల్లో నేను అడ్డమైన విషయం గురించీ పత్రికలకు రాస్తూ వుండేవాణ్ణి. అన్నింటినీ గురించీ రాశాను గాని దారిద్ర్యం గురించి రాయలేదు. ఎందుకు రాయలేదో నువ్వర్థం చేసుకోగలవు – ఇతర దరిద్రులు కూడా నా తరగతే నన్నది గుర్తించటం ఇష్టంలేక. నా దారిద్ర్యం నా వొక్కడిదేనని నన్ను నేనే చేసుకునే వంచన నుండి బయటపడటానికి నా భార్య చాలా తోడ్పడింది. ఇద్దరం కలిసి సోషలిస్టు సాహిత్యం చాలా చదివాం. దానివల్ల ఒక మేలు కలిగింది. జీవితానికి వొక తాత్కాలిక వ్యాఖ్యానం దొరికింది. జీవిత సంఘటనలు పరస్పర సంబంధం గలవన్న విశ్వాసం కుదిరింది.

"భుక్తి కోసం ప్రెస్‌లో పనికి కుదిరాను. అది పెద్ద ప్రెస్, ప్రెస్ వర్కర్ల యూనియన్ పెట్టాం. దానికి నాయకుణ్ణయినాను –"

"సమ్మెలు జరిపించావా?"

"మహారాజుగా! సమ్మెలంటే ఏమిటి? నీకు రాజకీయాలు, పనివాళ్ళకి జీవితం! చావుబతుకుల సమస్య! సమ్మెను గురించి కుడిచి కూచున్న ధోరణిలో మాట్లాడకు."

"నువ్వు కమ్యూనిస్టులతోచేరావా?"

"ఇంకెవరితో చేరమంటావు? నాకు రాజకీయాలంటే మొదటి నుంచీ ఏవగింపుగానే వుండేవి. మనం రాజకీయాల కృత్రిమ ముఖమే చూశాం. జీవితానికి రాజకీయాలకూ అవినాభావ సంబంధం గల చోట నేను మనస్ఫూర్తిగా రాజకీయాలలో ప్రవేశించాను.... నా జీవితంలో వొక్క రోజు వ్యర్థం కాలేదు. శ్రీశ్రీ చెప్పినట్టు అసంఖ్యాకులైన "దగాపడిన తమ్ము"లకు జీవితంలో వొక ఆశా, వొక కార్యక్రమం ఇవ్వటం కంటె నీ జన్మకు సార్థకత యేముంది? రేపటి ప్రపంచం ఈ దగాపడిన తమ్ములది. అది రాసి పెట్టి వుంది. వీళ్ళు రేపు ఏడవటం మానేస్తారు. తాము దగా పడ్డ సంగతి కూడా మరిచిపోతారు. యెత్తు పెరుగుతారు. అజాత శత్రువులౌతారు. జీవితాన్ని నిర్విఘ్నంగా నిర్మించుకుపోతారు. న్యాయం, ప్రేమా, సత్యం అన్న పదాలకు సార్థకత చేకూరుస్తారు. ఈ పరిణామానికి అనుకూలంగా నిలబడతావా? లేక దీనికి ప్రతికూలంగా నిలబడి మరింత రక్తపాతానికీ, మరింత దురన్యాయానికీ, మరింత హేయ చరిత్రకూ కారకుడవౌతావా? నా ధర్మం నేను ఏనాడో నిర్ణయించాను."

"నువు కమ్యూనిస్టువు. ఏమీ సందేహం లేదు. ఇందులో ఏదో కుట్ర ఉంది. నువు నా ప్రతిబింబానివి కావు. నా పేరు పెట్టుకుని నా యింట్లో ప్రవేశించావు" అన్నాడు పురుషోత్తం.

"నన్ను గురించి ఆలోచించినకొద్దీ రొంపిలో ఇరుక్కుంటావు. నీ సంగతి ఆలోచించు. 'సత్యం' గురించి ఎవరో వెటకారంగా పద్యాలు రాస్తే ఎన్నోసార్లు చదివి స్నేహితులతో ఆనందించావు. నువూ నీ స్నేహితులూ శాంతిని గురించి వేళాకోళంగా మాట్లాడుకున్నారు. నీ సంస్కారం ఏమిటి? నీ మానవత్వానికి కొలబద్ద ఏమిటి? నీ విశ్వాసాలకు పునాది ఏముంది? రేపు పోలీసుల చేతుల్లో తుపాకులు కమ్యూనిస్టు తుపాకులవుతే కమ్యూనిజంలో ఎంతో మంచి చూస్తావు నువు. కమ్యూనిజంలో ఆవగింజంత అనుమానాస్పదంగా కనిపిస్తే నేను దాన్ని గురించి తెలిసిన వాళ్ళతో చర్చిస్తాను. ఇరవై నాలుగేళ్ళనుంచీ ఈ కమ్యూనిజం గురించి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్న నాకంటె, నీకు దాని లోతుపాతులు తెలుసునంటే నేను ఒప్పుకోను."

"మీ కమ్యూనిస్టులు నడిచే జీవితాన్ని ఒక ధోరణిలో యెందుకు నడవనీరు? ప్రపంచమంతా తల్లకిందులు చేస్తామనే మిమ్మల్ని యెవరు సహిస్తారు?"

"ప్రపంచం మారకుండా నువు చేస్తానని మాట ఇయ్యి. కమ్యూనిస్టులనందర్నీ

నేను విరమింపజేస్తాను. నువు ఎవరి ప్రతినిధివో నాకు తెలీదు గాని లోకాన్ని కమ్యూనిజం నుంచి రక్షించటానికి కంకణం కట్టుకున్న పెద్ద తరగతి పెట్టుబడిదార్లు ప్రపంచం మారకుండా చెయ్యాలని చేసే ప్రయత్నం ఒక్కటీ కనిపించటం లేదు. వారు తెచ్చి పెట్టే ప్రతి సమస్యకూ కమ్యూనిజం పరిష్కారమార్గం చూపిస్తుంది. ఓపికగా కూర్చుని సరి అయిన విషయాలు సంపాదించు. ఇవాళ పెట్టుబడిదారీకి ప్రపంచ యుద్ధాలు తెచ్చి పెట్టటమూ, మానవజాతిలో పైశాచిక శక్తులను లేవదీయటమూ, మారణ సాధనాలు సృష్టించటమూ తప్ప ఇంకేమీ చాతగాదని నేనంటున్నాను. చాతనయితే నే నన్నది తప్పని రుజువు చెయ్యి."

"నువు చేసే అర్థంలేని సిద్ధాంతాలన్నీ తప్పని రుజువు చెయ్యటం తప్ప నాకింకేమీ పని లేదనుకున్నావా?"

"అయితే అభిప్రాయాలు ప్రకటించకు. నీ అజ్ఞానం నాకు శాసనమైతే యెంత హాస్యాస్పదంగా ఉంటుందో చూడు. నా మటుకు నేనూ నీ అంతవాణ్ణే కద!"

ఈ మాట వినగానే పురుషోత్తానికి అతనిమీద ఏదో అభిమానం కలిగింది. ఆ మనిషి తనకు అన్నా, తమ్ముడూ కన్న యెక్కువైనవాడు – సాక్షాత్తూ తనే. అతని వాదన ఎంత వెగటుగా వున్నా, యింకో పరిస్థితులలో తానుకూడా అటువంటి వాదన చేసి ఉండేవాడన్న మాటేగా? ఎందుకితనితో ఘర్షణ పడటం?

"నీకు నావల్ల ఆర్థికంగా యేదైనా సహాయం కావాలంటే చేస్తాను. పైకి ఎంత ప్రగల్భాలు పలుకుతున్నా లోపల నీ జీవితాన్ని నువ్వు ద్వేషిస్తూనే ఉండాలి. తానున్న పరిస్థితుల్ని సమర్థించుకునే దౌర్బల్యం ప్రతి వ్యక్తికీ ఉంటుంది. అందుకే యిట్లా మాట్లాడుతున్నావు. కావలిస్తే నా వ్యాపారంలో భాగం ఇస్తాను. లేదా పెట్టుబడి ఇస్తాను. నీ యిష్టం వచ్చిన వ్యాపారం చేసుకో. నీ సొంత కొడుకును పోలీసులు కాల్చి చంపినందుకు గర్విస్తున్నావంటే నీ అంతరాత్మ యెంత హీనస్థితికి వచ్చిందీ తెలుస్తోంది. నీకింకెవరన్నా పిల్లలున్నారా?"

"లేరు. నాకు నీ సహాయం అవసరం లేదు. నేను పైకి రాలేదని నువు విచారించకు. గడిచిన ఎన్నికల్లో పార్లమెంటు సీటుకు ఎన్నికైనాను. నన్ను ప్రజలు తమ నాయకుల్లో ఒకడుగా గుర్తించారు. యివాళ మీ క్లబ్బులో మీటింగు. నాకూ ప్రజలకూ గల సన్నిహిత సంబంధం యెటువంటిదో నువే చూద్దువుగాని."

పురుషోత్తానికి మండిపోయింది.

"పచ్చి అబద్ధాలు! నన్ను మోసం చెయ్యకు. నాకు తెలీకుండా మా క్లబ్బులో మీటింగెవరు పెట్టారు? నిన్న బెజవాడలో మీటింగయిందన్నావు. పత్రికలో ఆ వార్త లేదు. ఇట్లా నన్ను మోసం చేస్తావా?"

"నువ్వింకో ప్రపంచంలో ఉన్నావు. నా మాటలు నీకు అబద్ధంగానే కనబడతాయి."

బెడ్‌రూమ్‌లో అలికిడి అయింది. పురుషోత్తం భార్య కేకపెట్టింది. పురుషోత్తం గబగబా లోపలికి వెళ్ళాడు.

"ఏమిటో చదువుతున్నట్టున్నారు. నింపాదిగా చదువుదురూ! తల పగిలి పోతోంది!" అన్నదామె.

పురుషోత్తం మాట్లాడలేదు.

"ఈ అపరాత్రివేళ ఎందుకొచ్చిన చదువు? పడుకుని నిద్రపోరాదా?"

పురుషోత్తం మారు మాట్లాడకుండా పక్కమీద పడుకున్నాడు. అతనికి నిద్ర పట్టి వుండాలి. అతను మళ్ళీ కళ్ళు తెరిచేసరికి ఏడుగంటలు దాటింది.

లేస్తూనే అతను తన అతిథులకోసం వెతికాడు. వారి జాడ లేదు....

ఆ రోజల్లా అతనికి కలలాగే వుంది. క్లబ్బుకు వెళ్లాడు, మీటింగూ లేదు యేమీలేదు. ఉండదని అతనికి తెలుసు. అందుచేత ఆశ్చర్యం కలగలేదు. కాని యేదో జనం కలకల వినిపిస్తున్నట్టే ఉంది. ఏదో ఉపన్యాసం అస్పష్టంగా వినిపిస్తున్నట్టే వుంది. మధ్య మధ్య ప్రేక్షకుల కోలాహలం కూడా ఒకటి రెండుసార్లు వినిపించిందనిపించింది.

స్నేహితులెవరో "ఎందుకట్టా ఉన్నావ్?" అంటే రాత్రల్లా నిద్రలేదనీ, వంట్లో బాగా లేదనీ చెప్పాడు. ఆ సాయంకాలం ఏ స్నేహితుడి ఇంటికో వెళ్ళి చిత్తుగా తాగి కారులో ఇంటికి వెళ్ళి పడుకున్నాడు.

5

వారం రోజుల అనంతరం పురుషోత్తం యత్నాలుఫలించి అతను ఒకప్పుడు పెళ్లాడదామనుకున్న స్త్రీ వార్త తెలిసింది. ఆమె తన పెళ్ళి అయిన కొద్ది రోజులకు ఆకస్మికంగా మరణించిందట. కారణం తెలియలేదు. ఆ సమయానికి ఆమె గర్భిణిగా వున్నదీ లేనిదీ తెలియరాలేదు.

మొదటి ముద్రణ : ఆంధ్రజ్యోతి మాసపత్రిక, నవంబర్ 1952